సాక్షి ఖమ్మం

శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



ఎనిమిది నెలల్లోనే శిక్ష ఖరారు

ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావును హత్య చేసిన నిందితులు ఇద్దరికి జీవితఖైదు విధిస్తూ భద్రాద్రి జిల్లా జడ్జి తీర్పు వెలువరించారు. 8లో



ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

జిల్లా కేంద్రంలో నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించేందుకు పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. 8లో



గరిష్టం / కనిష్టం
34° / 25°

వాతావరణం

శుక్రవారం జిల్లాలో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

ఎన్నికల కాక.. పథకాల కేక

ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రభుత్వం ఒక్కటొక్కటిగా తాయిలాలు ప్రకటిస్తోంది. గతంలో పెండింగ్‌లో ఉన్న వాటికి నిధులు విడుదల చేయడమే కాక కొత్త పథకాలను కూడా వెల్లడిస్తోంది. గడచిన నెల రోజుల్లోనే రైతుల రుణ మాఫీ, బీసీ, మైనార్టీ, క్రిస్టియన్లకు రూ.లక్ష రుణం, దివ్యాంగుల పింఛన్ పెంపు, వీఆర్‌ఏలను రెగ్యులర్ ఉద్యోగుల గుర్తిస్తామని ప్రకటించడమే కాక ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ నిర్ణయించింది. ఈ పథకాలతో జిల్లాలోని ఆయా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతుండగా.. జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



రుణమాఫీ నిర్ణయంతో పెదతండాలోని వరి పొలంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతు, కూలీలు, పక్కన మాజీ ఎమ్మెల్యే చంద్రావతి

- ఇటీవల ప్రభుత్వం నుంచి వరుస ప్రకటనలు
- బీసీ, మైనార్టీ, క్రిస్టియన్లకు రూ.లక్ష రుణం
- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం.. వీఆర్‌ఏల రెగ్యులరైజేషన్
- దివ్యాంగుల పింఛన్ పెంపు.. రైతు రుణమాఫీ మొదలు

14,883 మందికి బీసీ రుణాలు

దళితబంధు తరహాలో బీసీలకు రూ.లక్ష చొప్పున రుణం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కుల, చేతివృత్తుల వారి కోసం ఈ పథకాన్ని ప్రకటించగా జిల్లాలో 26,451 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 14,883 మందిని అర్హులుగా గుర్తించి తొలి విడతగా 40 మందికి చెక్కులు కూడా ఇచ్చారు. ఆతర్వాత నియోజకవర్గానికి 300 మంది చొప్పున 1,500 మంది కోసం రూ.15 కోట్లు మంజూరయ్యాయి. వీరే కాక మైనార్టీలు, క్రిస్టియన్లకు కూడా రుణం ఇవ్వనున్నట్లు ప్రకటించి దరఖాస్తులు స్వీకరించేందుకు కసరత్తు చేస్తోంది.

నిధులు.. నిర్ణయాలు

మున్నేరుకు వచ్చిన వరదతో ఖమ్మం, ఖమ్మం రూరల్ మండలంలోని పరీవాహక ప్రాంతం మునిగింది. దీంతో మున్నేరుకు ఇరువైపులా కాంక్రీట్ వాల్ నిర్మించాలని కేబినెట్ భేటీలో నిర్ణయించి రూ.150 కోట్లు మంజూరు చేశారు. అలాగే మున్నేరుపై తీగల వంతెన పనులు త్వరలో మొదలుకానుండగా, గోళ్లపాడు–2 పేరిట నగరంలోని 20 డివిజన్ల పరిధిలో మురుగునీటిని చెరువుల్లోకి కాకుండా ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా మున్నేటికి తరలించేలా రూ.180 కోట్ల అంచనా వ్యయంతో పనులకు రూపకల్పన జరిగింది. ప్రభుత్వం వరుసగా వెలువరిస్తున్న నిర్ణయాలను బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలకు తెలియచేస్తూ సంబరాల్లో నిమగ్నమవుతున్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఏ ప్రకటననూ వదలకుండా క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తున్నారు.

28,992 మంది దివ్యాంగులకు లబ్ధి

దివ్యాంగులకు ఆసరా పథకం ద్వారా ఇస్తున్న రూ.3,016 పింఛన్‌ను రూ.వెయ్యి పెంచారు. ఈ నిర్ణయంతో జిల్లాలో పింఛన్ తీసుకుంటున్న 28,992 మంది దివ్యాంగులకు లబ్ధి చేకూరనుంది.

వీఆర్‌ఏలు, ఆర్టీసీ ఉద్యోగుల్లో ఆనందం

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తుండడంపై ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఖమ్మం రీజియన్‌లోని ఆరు డిపోల్లో కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజీ, కార్యాలయాల ఉద్యోగులు 2,109 మందికి ఈ నిర్ణయంతో లబ్ధి చేకూరనుంది. మరో 227 మంది సీనియర్, జూనియర్ స్కేల్ ఆఫీసర్లు, క్లాస్ 2 సూపర్‌వైజర్లు, క్లరికల్ ఉద్యోగులు, కంట్రోలర్లు, ఏడీసీలు కూడా ప్రభుత్వంలో విలీనమవుతారు. అలాగే, వీఆర్‌ఏల సర్వీస్ క్రమబద్ధీకరణ, పే స్కూల్ అమలు నిర్ణయంతో జిల్లాలో పనిచేస్తున్న 618 మందిని త్వరలోనే ఇతర శాఖల్లో సర్దుబాటు చేయనున్నారు.

రుణమాఫీ కూడా..

2020 డిసెంబర్ నుంచి విడతల వారీగా రైతుల రుణమాఫీ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. తొలివిడతలో రూ.25 వేల లోపు పంట రుణాలు మాఫీ చేయగా, రూ.50 వేలలోపు రుణ మాఫీని 2021 ఆగస్ట్ నుంచి ప్రారంభించింది. వీరు కాక జిల్లాలో ఇంకా 2,82,974 మంది రైతులు తీసుకున్న రూ.2,330.67 కోట్ల పంట రుణాలు తాజా నిర్ణయంతో మాఫీ కానున్నాయి.

పింఛన్ పెంపుతో ఆనందం



ప్రభుత్వం మాకు ఇచ్చే ఆసరా పెన్షన్‌ను రూ.3,016 నుంచి రూ.4,016కు పెంచడం సంతోషంగా ఉంది. అంగవైకల్యం కలిగి ఏ పనిచేయలేని మాకు ఈ సొమ్ము ఉపయోగపడుతుంది. పింఛన్ పెంచిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు.

– కొండా రామారావు, ముష్టికుంట్ల, బోనకల్ మండలం

రుణమాఫీ నిర్ణయం హర్షణీయం



రుణమాఫీని పునఃప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయం. నేను 2018లో రూ.1.80 లక్షల రుణం తీసుకున్నా. అయితే, మాఫీ మధ్యలో ఆగిపోగా, ఇప్పుడు మళ్లీ ప్రారంభిస్తుండడంతో రూ.లక్ష వరకు మాఫీ అవుతుంది.

– కుంట వెంకటేశ్వర్లు, ఎద్దుల్లచెరువు, తిరుమలాయపాలెం మండలం

మా జీవితాలు బాగుపడతాయి..



చాన్నాళ్లుగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తారని చూస్తున్నాం. ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మా జీవితాలు బాగుపడతాయి. సీఎం కేసీఆర్, రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్ సారథ్యాన తీసుకున్న నిర్ణయం ఆనందంగా ఉంది.

– పులిపాటి వెంకటేశ్వర్లు, డ్రైవర్, ఖమ్మం డిపో

రైల్వేస్టేషన్ల అభివృద్ధికి నిధులు కేటాయించండి



కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు లేఖ అందజేస్తున్న ఎంపీ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలోని రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ, అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, రైల్వే బోర్డ్ చైర్మన్, దక్షిణ మధ్య రైల్వే జీఎంలకు లేఖలు రాయగా, గురువారం మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ అందజేసి మాట్లాడారు. రైల్వేస్టేషన్లలో సీసీ టీవీలు, ఎస్కలేటర్లు, లిఫ్టులు, తాగునీటి సౌకర్యం, వెయిటింగ్ హాళ్లు తదితర సౌకర్యాలు కల్పించాల్సి ఉందని తెలిపారు. ఖమ్మం, కొత్తగూడెంతో పాటు మధిర రైల్వేస్టేషన్లకు స్టేషన్ రూ.40 కోట్ల చొప్పున, ఇతర స్టేషన్లలో అభివృద్ధి పనులకు రూ.10 కోట్ల చొప్పున కేటాయించాలని కోరారు. అలాగే, భద్రాచలం రోడ్ – కొవ్వూరు రైల్వేలైన్ పూర్తిచేయడంతో పాటు చంద్రుగొండ, సత్తుపల్లిలో రైల్వేస్టేషన్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని నామ కోరారు.

అందరి సహకారంతోనే న్యాక్ గ్రేడ్



నారాయణరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

ఖమ్మం సహకారనగర్: అందరి సహకారంతోనే కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ లభించిందని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. కళాశాలలో గురువారంఆయన ఐక్యూఏ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ సత్యవతితో కలిసి మాట్లాడారు. పూర్వ విద్యార్థులైన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ బండి పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వరరెడ్డి, తాతా మధు, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, మేయర్ నీరజ తదితరుల సహకారం మరువలేనిదని చెప్పారు.

రూ.10లక్షల విరాళం

కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ ప్లస్ గుర్తింపు లభించడంతో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యాన గెంటేల నారాయణ రావు విగ్రహం వద్ద నివాళులర్పించారు. పూర్వవిద్యార్థి నారాయణ ప్రదీప్ మరమ్మతుల కోసం రూ.10లక్షల విరాళం ప్రకటించారు. కేయూ పాలకమండలి సభ్యుడు సీతారాం, వైస్ ప్రిన్సిపాల్ జీవన్‌తో పాటు ఎన్.తిరుమలరావు, షౌకత్ అలీ, వి.ఆనంద్‌కుమార్, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, సయ్యద్ ఇస్మాయిల్, టి.మణిభూషణాచారి, బి.వసంతరావు, ఎ.నరేష్, బి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పది మంది ఎంపీడీఓల బదిలీ

ఖమ్మం సహకారనగర్: త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యాన ఒక్కో శాఖలో అధికారుల బదిలీల పర్వం కొనసాగుతోంది. ఈ మేరకు గురువారం జిల్లాలోని పది మంది ఎంపీడీఓలను బదిలీ చేస్తూ కలెక్టర్ వీ.పీ. గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. అధికారులు నూతన స్థానాల్లో వెంటనే విధుల్లో చేరాలని సూచించారు.

ఎంపీడీఓ	ప్రస్తుత మండలం	నూతన స్థానం
బి.జయరాం	తిరుమలాయపాలెం	సత్తుపల్లి
సీహెచ్.సుభాషిణి	సత్తుపల్లి	డీఆర్‌డీఏ, ఖమ్మం
కె.మహాలక్ష్మి	పెనుబల్లి	కొణిజర్ల
డి.శ్రీనివాసరావు	ముదిగొండ	పెనుబల్లి
బి.రవీంద్రరెడ్డి	తల్లాడ	తిరుమలాయపాలెం
బి.అశోక్	ఏన్కూరు	ముదిగొండ
డి.కరుణాకర్‌రెడ్డి	కూసుమంచి	వైరా
ఆర్.రమాదేవి	కొణిజర్ల	కూసుమంచి
వీ.డీ.వీ.అశోక్‌కుమార్	ఖమ్మం రూరల్	బోనకల్
బి.వేణుమాధవ్	బోనకల్	ఏన్కూర్

ఎట్టకేలకు రైతులకు పరిహారం

- ఎస్సారెస్పీ కాల్వల తవ్వకానికి తొలగిన అడ్డంకులు
- అదనంగా ఆరు వేల ఎకరాలకు అందనున్న సాగునీరు



కూసుమంచి వద్ద నిలిచిన కాల్వ పనులు (ఫైల్)

కూసుమంచి: నిర్వాసిత రైతులకు ఏళ్ల తర్వాత పరిహారం అందడంతో శ్రీరాంసాగర్ రెండో దశ కాల్వల నిర్మాణానికి అడ్డంకులు తొలగినట్లయింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో కూసుమంచి మండలంలో ఎస్సారెస్పీ రెండో దశ కాల్వల నిర్మాణం చేపట్టారు. అయితే, లోక్యాతండా, కోక్యాతండా, కూసుమంచికి చెందిన కొందరు రైతులు తక్కువ పరిహారం ఇస్తున్నారని కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. వీరు కాక మిగిలిన రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకరించడంతో కాల్వల నిర్మాణం చేపట్టగా, కొన్ని పనులు జరగలేదు. ఫలితంగా కూసుమంచి, జుజుల్‌రావుపేట, లోక్యాతండా, గట్టుసింగారం, పెరికసింగారం రావిచెట్టుతండా, పాలేరు, గురువాయిగూడెం గ్రామాల రైతులకు సాగునీరు అందటం లేదు. ఈమేరకు బాధిత రైతుల విజ్ఞప్తితో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పనులను అడ్డుకున్న రైతులను ఒప్పించడమే కాక ప్రభుత్వంతో మాట్లాడి పరిహారం పెంచేలా కృషిచేశారు. దీంతో 13 మంది రైతులకు సంబంధించి 11.18 ఎకరాల భూమికి రూ.1.64 కోట్ల పరిహారాన్ని రాష్ట్రప్రభుత్వం తాజాగా వారి ఖాతాల్లో జమచేసింది. దీంతో పెండింగ్ ఉన్న చోట కాల్వ తవ్వకానికి అడ్డంకులు తొలగడంతో ఆయా గ్రామాల్లో మరో ఆరు వేల ఎకరాలకు అదనంగా సాగునీరు అందనుంది.

వీఆర్‌ఏల విలీనానికి కసరత్తు

- రేపటి లోగా పోస్టింగ్?
- శాఖల వారీగా ఖాళీల లెక్క తేల్చిన అధికారులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రప్రభుత్వం ఇటీవల వీఆర్‌ఏ(గ్రామరెవెన్యూ సహాయకులు) సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తూ వివిధ శాఖల్లో సర్దుబాటు చేయనున్నట్లు ప్రకటించింది. అలాగే, ఈ నెల 5వ తేదీలోగా ప్రక్రియ పూర్తిచేయాలని మార్గదర్శకాలు విడుదల చేసింది. దీంతో జిల్లా అధికారులు శాఖల వారీగా లెక్కలు తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 759 వీఆర్‌ఏ పోస్టులు ఉండగా, ప్రస్తుతం 618మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో డైరెక్ట్ రిక్రూట్ అయిన వారు 189మంది, మిగతా 429 మంది వారసత్వంగా కొనసాగుతున్నారు.

ఖాళీలు ఇలా...

ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలోని వివిధ శాఖల్లో 530 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఇందులో ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు 425, మిషన్ భగీరథలో 80, రికార్డు అసిస్టెంట్ పోస్టులు 25 ఉన్నాయి. శాఖల వారీగా పరిశీలిస్తే వ్యవసాయ శాఖలో 19, పశు సంవర్ధక శాఖలో 57, బీసీ వెల్ఫేర్‌లో 32, కళాశాల విద్యలో 22, పబ్లిక్ హెల్త్‌లో 23, ఇంటర్మీడియట్ విద్యాశాఖలో 15, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్‌లో 29, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో 94, పంచాయతీరాజ్‌కు సంబంధించి నాలుగు, ఎస్సీ కార్పొరేషన్‌లో 37, పాఠశాల విద్యలో 45, టెక్నికల్ ఎడ్యుకేషన్ ఐదు, ట్రైబల్ వెల్ఫేర్ 29.. ఇలా పలు శాఖల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయనే నిర్ధారణకు వచ్చారు.

పోస్టులు సరిపోకపోతే..

జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో 530 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు లెక్కతేల్చారు. కానీ 618 మంది వీఆర్‌ఏలు విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో ఖాళీ పోస్టుల్లో సర్దుబాటు చేసే వారిని మినహాయించి మిగతా వారిని ఇతర జిల్లాలకు కేటాయించనున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ విషయమై పోస్టింగ్‌లు మొదలయ్యాక స్పష్టత రానున్నది. కాగా, పదో తరగతి లోపు విద్యార్హత ఉన్న వారిని నాలుగో తరగతి ఉద్యోగులుగా, ఇంటర్ అర్హత ఉంటే రికార్డు అసిస్టెంట్,/తత్సమాన హోదాలో నియమిస్తారు. ఇక డిగ్రీ ఆపై చదివిన వారికి జూనియర్ అసిస్టెంట్ హోదా కల్పిస్తారు. తొలుత ప్రస్తుతం జిల్లాలోని వివిధ శాఖల ఖాళీల్లో వీఆర్‌ఏలకు పోస్టింగ్ ఇచ్చాక మిగిలే వారికి సంబంధించి దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది.

వైన్స్ రిజర్వేషన్లు ఖరారు



విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్ర ఇస్తున్న కలెక్టర్



డ్రా ద్వారా వైన్స్ రిజర్వేషన్లు ఎంపిక చేస్తున్న గౌతమ్

- డ్రా ద్వారా ఖరారు చేసిన కలెక్టర్ గౌతమ్
- నేడు నోటిఫికేషన్, టెండర్ల స్వీకరణ

ఖమ్మంక్రైం: నూతన మద్యం పాలసీకి సంబంధించి నోటిఫికేషన్ శుక్రవారం విడుదల కానుంది. జిల్లాలో 122 వైన్స్ ఏర్పాటుకు శుక్రవారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు టెండర్ దరఖాస్తులు స్వీకరించనున్నారు. గతంలో మాదిరిగానే వైన్స్‌లో ప్రభుత్వం రిజర్వేషన్లు ప్రకటించడంతో షాపుల వారీగా ఖరారు చేసేందుకు గురువారం డ్రా తీశారు. ఖమ్మం డీపీఆర్సీ భవనంలో ఎక్సైజ్ అధికారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ అధికారుల ఆధ్వర్యాన కలెక్టర్ గౌతమ్ నేతృత్వాన డ్రా చేపట్టారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 122 మద్యం దుకాణాలకు గాను గౌడ కులానికి 18(15శాతం), ఎస్సీలకు 14(10శాతం), ఎస్టీలకు 8(5శాతం) షాపులు కేటాయించినట్లు తెలిపారు. డ్రా ద్వారా గౌడ కులస్తులకు 1, 2, 4, 7, 17, 18, 41, 62, 66, 67, 77, 92, 94, 101, 109, 110, 114, 116 నంబర్ల షాపులు దక్కాయని వివరించారు. ఇక ఏజెన్సీ ప్రాంతంలో ఎస్టీలకు కేటాయించిన షాపులకు గాను 117, 118, 119, 120, 121, 122 షాపులు, మైదాన ప్రాంతంలో 12, 21 నంబర్ షాపులను డ్రా ద్వారా ఖరారు చేసినట్లు తెలిపారు. అలాగే, ఎస్సీలకు సంబంధించి 13, 24, 25, 26, 34, 49, 71, 78, 82, 86, 87, 97, 99, 111 నంబర్ షాపులు కేటాయించామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ వేణుగోపాల్‌రెడ్డి, సీఐ రాజు, ఎస్సీ, బీసీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు సత్యనారాయణ, జ్యోతి, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

ఖమ్మం అర్బన్: నులి పురుగు నివారణతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం దరిచేరుతుందని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని ఇందిరానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ మాత్రల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, బరువు తగ్గడం, కడుపునొప్పి వంటివి నివారించవచ్చన్నారు. ఆతర్వాత కలెక్టర్ ఇందిరానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలలో టాయిలెట్ల కొరతను హెచ్‌ఎం శైలజ తెలపగా.. టాయిలెట్ బ్లాక్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డీఎంహెచ్‌ఓ మాలతి, డీఈఓ సోమశేఖరశర్మ, సీఎంఓ రాజశేఖర్, అదనపు డీఎంహెచ్‌ఓ ప్రమీల, ప్రాజెక్ట్ అధికారి సైదులు, ఎస్‌ఎంసీ చైర్మన్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నష్టంపై కేంద్ర బృందం ఆరా..

- గోదావరి ముంపు ప్రాంతాల్లో పర్యటించిన సభ్యులు
- రైతులతో మాట్లాడి వివరాల సేకరణ



బూర్గంపాడు మండలంలో పర్యటిస్తున్న కేంద్ర బృందం సభ్యులు, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక

బూర్గంపాడు/అశ్వాపురం : గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో కేంద్ర బృందం సభ్యులు గురువారం పర్యటించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడులోని పులితేరు, అశ్వాపురం మండలం ఆనందాపురంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంటనష్టంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అధికా రులు మాట్లాడుతూ.. వరదలు వచ్చినా నష్టం వాటిల్లని పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదలతో నష్టపోయిన పంటలు, రహదారులపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందించి పరిహారం వచ్చేలా చూస్తామని భరోసా ఇచ్చారు. గతేడాది కూడా కేంద్ర బృందం పర్యటించినా నేటికీ నష్టపరిహారం ఎందుకు అందించలేదని పలువురు రైతులు ప్రశ్నించారు.

దెబ్బతిన్న రహదారులపై ఆరా

ఆతర్వాత అనంతరం బూర్గంపాడు కొల్లుచెరువు వద్ద దెబ్బతిన్న రహదారులను కేంద్ర బృందం పరిశీలించగా వివరాలను కలెక్టర్ ప్రియాంక ఆల వెల్లడించారు. దెబ్బతిన్న పంటలతో పాటు నీట మునిగిన ఇళ్లు, రహదారులు, నష్టపోయిన పశువులు, మిషన్ భగీరథ, ఇరిగేషన్ పథకాలపై వివరించారు. వదరలతో 11 మండలాల పరిధిలోని 84 గ్రామాలు ముంపునకు గురయ్యాయని, 44 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 4,454 కుటుంబాలకు చెందిన 14,081 మందిని పునరావాస కేంద్రాలకు తరలించామని వివరించారు. కాగా, వరదలతో 103 ఆవాసాల్లో 11 చోట్ల మిషన్ భగీరథ పైప్‌లైన్లు మరమ్మతులకు గురయ్యాయని, 41 ఇళ్లు పూర్తిగా, 162 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, 44 గ్రామాల్లో 1,402 మంది రైతులకు చెందిన 3,151 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. పీఆర్ రోడ్లు 115, ఆర్అండ్‌బీ రోడ్లు 61 మరమ్మతులు గురయ్యాయని వివరించారు. కేంద్ర బృందంలో జాతీయ విపత్తులు, హోం మంత్రిత్వ శాఖ సలహాదారు కునాల్ సత్యార్థి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండీచర్ డిప్యూటీ సెక్రటరీ అనిల్ గైరోల, సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ రమేష్‌కుమార్, మినిస్ట్రీ ఆఫ్ పవర్ డిప్యూటీ డైరెక్టర్ భయా పాండే, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సీనియర్ సైంటిస్ట్ శ్రీనివాసులు, ఆయిల్‌సీడ్స్ డైరెక్టర్ పొన్నుస్వామి, ఐఈఎస్ రీజినల్ అధికారి ఎస్‌కే కుష్వా ఉన్నారు. ఈ బృందం వెంట పర్యటనలో ఎస్పీ వినీత్, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ మధుసూదన్‌రావు, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వరరెడ్డి, ఆర్అండ్‌బీ, పీఆర్, మిషన్ భగీరథ ఈఈలు భీమ్లా, మంగ్యా, తిరుమలేష్, నళిని, డీఏఓ అభిమన్యుడు, ఉద్యాన అధికారి జినుగు మరియన్న, పశు సంవర్ధక అధికారి పురంధర్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఏడీఏ తాతారావు పాల్గొన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలన

భద్రాచలం: వర్షాలు, గోదావరి వరదలతో దెబ్బతిన్న పంటలు, ఇతర నష్టంపై ఐటీడీఏలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను బృందం సభ్యులు పరిశీలించారు. కలెక్టర్ ప్రియాంక ఆల, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ వారికి నష్టం వివరాలను తెలియజేశారు.

న్యూస్‌రీల్

పోలీసు సిబ్బంది కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెక్కులు



ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రఘునాథపాలెం పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ వి.వెంకటేశ్వర్లు కుటుంబానికి రూ.8లక్షలు, ఖమ్మం టూ టౌన్ కానిస్టేబుల్ ఆర్.అనిల్‌కుమార్ కుటుంబానికి రూ.7.87లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరైంది. ఆయా కుటుంబాలకు గురువారం పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ చెక్కులు అందజేసి మాట్లాడారు. శాఖాపరంగా అన్ని విధాలా అండగా నిలుస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఓ అక్తరున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 15నాటికి హరితహారం పూర్తి


నేలకొండపల్లి: జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు ఈనెల 15వ తేదీ నాటికి నూరు శాతం మొక్కలు నాటేలా కార్యాచరణ రూపొందించినట్లు డీఆర్‌డీఓ ఏపీడీ డి.శిరీష వెల్లడించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నర్సరీలను గురువారం ఆమె పరిశీలించాక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 589 జీపీల్లో ఉన్న నర్సరీల్లో 46.08 లక్షల మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. ఇవేకాక గతంలో సిద్ధంగా ఉన్నవి కలిపి జిల్లాలో ఈ ఏడాది 10 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించి ఇప్పటికే 4 లక్షల మొక్కలు నాటినట్లు వెల్లడించారు. కాగా, ఉద్యానవన శాఖ ఆధ్వర్యాన ఉపాధి హామీ పథకం ద్వారా ఐదెకరాల్లోపు రైతులు పండ్ల తోటలు సాగుచేసేలా ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఈజీఎస్ ఏపీఓ ఆర్.సునీత, ఈసీ శేషగిరిరావు పాల్గొన్నారు.

రైతు బీమాలో పేరు నమోదుకు రేపటి వరకు అవకాశం

ఖమ్మంవ్యవసాయం: రైతుబీమా పథకంలో పేర్ల నమోదు గడువు శనివారంతో ముగియనుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల తెలిపారు. రైతుబీమా పథకంలో చేరేందుకు జూన్ 18 నాటికి ధరణి పోర్టల్ ద్వారా ధృవీకరించిన పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు, గతంలో పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకుని వారు అర్హులని పేర్కొన్నారు. ఆయా రైతులు దరఖాస్తు, పట్టాదారు పాస్ పుస్తకం, రైతు, నామినీ ఆధార్ జిరాక్స్‌లతో ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదివితేనే ఫలితం

- పాఠం బోధించిన అదనపు కలెక్టర్ మధుసూదన్



పాఠం బోధిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకుని ఏకాగ్రతతో చదివితే ఫలితం ఉంటుందని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ తెలిపారు. ఖమ్మం ఎన్ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు వివరాలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంపై ఆరా తీశారు. ఆతర్వాత పదో తరగతి విద్యార్థులకు పాఠం బోధించిన ఆయన జీవితంలో ఎదగడానికి చదువు ఉపయోగపడుతుందని తెలిపారు. హెచ్‌ఎం శంకర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచేందుకు కృషి



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మంరూరల్/కూసుమంచి: విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. ఖమ్మం రూరల్ మండలంలోని బాలజ్యోతి పాఠశాలతో కూసుమంచిలో ఉపాధ్యాయులకు ఇస్తున్న తొలిమెట్టు శిక్షణ తరగతులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు బోధనాభ్యాసన ప్రక్రియను సులభం చేసేందుకు వర్క్‌బుక్‌లు సమకూర్చగా, శిక్షణలో నేర్చుకున్న అంశాల ఆధారంగా విద్యార్థుల ఉన్నతికి పాటుపడాలని సూచించారు. ఈకార్యక్రమంలో నోడల్ అధికారి వీరస్వామి, కోర్సు కోఆర్డినేటర్ జిత, రిసోర్స్ పర్సన్లు రామకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

నంబర్ ప్లేట్ లేని వాహనాలకు జరిమానా

ఖమ్మంక్రైం: లైసెన్స్, నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి హెచ్చరించారు. నేరాలు, ప్రమాదాల నియంత్రణకు గాను లైసెన్స్, నంబర్ ప్లేట్లు లేని వాహనాలు గుర్తించేందుకు ఖమ్మం ట్రాఫిక్ పోలీసులు గురువారం నుంచి ప్రత్యేక డ్రైవ్‌కు శ్రీకారం చుట్టారు. ఈమేరకు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 50వాహనాలను సీజ్ చేయడమే కాక యజమానులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ జరిమానా నుంచి తప్పించుకునేందుకు పలువురు నంబర్ ప్లేట్లను తొలగించగా, మరికొందరు నంబర్లు కనిపించకుండా మారుస్తున్నారన్నారు. తద్వారా ప్రమాదాలు జరిగితే బాధితుల గుర్తింపు కష్టమవుతోందని చెప్పారు. తనిఖీల్లో సీఐ అశోక్, ఎస్ఐ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

హైవే నుంచి దారి వదలాలని ఆందోళన

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 15వ డివిజన్ పరిధిలో రామకృష్ణాపురానికి వెళ్లే డొంక రోడ్డుకు అనుసంధానంగా ఖమ్మం – దేవరపల్లి నేషనల్ హైవేలో 40 అడుగుల మార్గం వదలాలని స్థానికులు ఆందోళన చేపట్టారు. కార్పొరేటర్ రావూరి కరుణసైదబాబు ఆధ్వర్యాన గ్రామస్తులు, రైతులు గురువారం హైవే పనులు అడ్డుకుని నిరసన తెలిపాక అధికారులకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డొంకరోడ్డు మార్గంలో కేవలం కాలినడకకే దారి వదిలారని, తద్వారా పొలాలకు వెళ్లే రైతులకు ఇబ్బంది ఎదురవుతుందని తెలిపారు. ఈమేరకు 40 అడుగుల మార్గం వదలాల్సిందేనని డిమాండ్ చేశారు.

నలుగురిపై పోక్సో కేసు నమోదు

- బాలికపై అత్యాచారం చేసిన మైనర్లు

చింతకాని: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన చింతకాని మండలానికి చెందిన ముగ్గురు, తిరుమలాయపాలెం మండలానికి చెందిన ఒక మైనర్ బాలుడిపై గురువారం పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఈమేరకు చింతకాని పోలీసులు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. చదువు మానేసిన బాలిక ఇంటి వద్ద ఉంటుండగా, తిరుమలాయపాలెం మండలానికి చెందిన బాలుడు గ్రామంలోని తన బంధువుల ఇంటికి వచ్చినప్పుడు పరిచయం పెంచుకుని అత్యాచారం చేశాడు. ఈ విషయాన్ని గమనించిన ఈ గ్రామానికి చెందిన మరో ముగ్గురు మైనర్ బాలురు బాలికను బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డారు. ఎవరికైనా చెబితే చంపేస్తామని వారు బెదిరించడంతో బాలిక విషయాన్ని బయటపెట్టలేదు. ఆతర్వాత బాలిక శరీరంలో మార్పులు రాగా కుటుంబీకులు మందలించగా అసలు విషయాన్ని చెప్పింది. దీంతో బాలిక కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా నలుగురు బాలలపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కాగా, ప్రస్తుతం సదరు బాలిక ఏడు నెలల గర్భిణి అని సమాచారం.

పోలీసులను అడ్డుకున్న వ్యక్తిపై కేసు

కల్లూరు: పోలీసుల విధినిర్వహణకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై గురువారం కల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని రాళ్లబంజరలో బుధవారం రాత్రి గుగులోత్ వీరబాబు తన భార్య పుష్పతో గొడవపడి సీసాతో తలపై కొట్టాడు. దీంతో అదే గ్రామంలో ఉన్న పుష్ప తండ్రి దేవ్లా ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్తుండగా వీరబాబు అడ్డుకున్నాడు. ఈమేరకు 100కు సమాచారం ఇవ్వగా హెడ్ కానిస్టేబుల్ శ్రీను, కానిస్టేబుల్ సుందరం వెళ్లి పుష్పను ఆస్పత్రికి తరలిస్తుండగా వారి వాహనానికి వీరబాబు అడ్డుపడి రాయితో బెదిరిస్తూ గంట పాటు నానా రభస చేశాడు. దీంతో సిబ్బంది ఫిర్యాదు మేరకు ఆయనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రఘు తెలిపారు. అలాగే, వరకట్నం వేధిస్తున్నాడని, హత్యాయత్నం చేశాడని పుష్ప ఇచ్చిన ఫిర్యాదుతో ఇంకో కూడా నమోదు చేశామని వెల్లడించారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని తీర్థాలకు చెందిన నూనావత్ రాజు(42) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. డోర్నకల్ మండలం రాముతండాకు చెందిన రాజు కొంతకాలంగా భార్యాపిల్లలతో కలిసి తీర్థాలలో ఉంటున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన ఆయనను తీరు మార్చుకోవాలని సూచించినా పట్టించుకోవడం లేదు. ఈక్రమంలో 1వ తేదీన అతిగా మద్యం సేవించి అదే మత్తులో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రాజు కుమారుడు జశ్వంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

రైతు మృతదేహం లభ్యం

ముదిగొండ: మండలంలోని పెద్దమండవ మున్నేరులో మూడు రోజుల క్రితం గల్లంతైన రైతు చమట కొండల్‌రావు(39) మృతదేహం గురువారం లభ్యమైంది. గంధసిరికి చెందిన రైతు కొండల్‌రావు మున్నేరులో పడి మంగళవారం గల్లంతైన విషయం విదితమే. అప్పటి నుంచి మున్నేరులో గాలిస్తుండగా, పెద్దమండవ సమీపాన గురువారం మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైతు భార్య జానకి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

8 నెలల్లోనే శిక్ష ఖరారు..

- ఎఫ్ఆర్ఓ హత్యకేసులో తీర్పుపై సర్వత్రా హర్షం
- ఆత్మస్థైర్యం నింపుతుందన్న అటవీ అధికారులు
- ధన్యవాదాలు తెలిపిన శ్రీనివాసరావు సతీమణి భాగ్యలక్ష్మి



కనకగిరి అటవీప్రాంతంలో విధి నిర్వహణలో ఉద్యోగులు, శ్రీనివాసరావు (ఫైల్)

చుంచుపల్లి/చంద్రుగొండ : అటవీ రేంజ్ అధికారి చలమల శ్రీనివాసరావు హత్య కేసులో ఎనిమిది నెలల్లోనే నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ కొత్తగూడెం జిల్లా జడ్జి పాటిల్ వసంత్ తీర్పు వెలువరించడంపై సర్వత్ర హర్షం వ్యక్తం అవుతోంది. అడవుల సంరక్షణకు ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న సిబ్బందికి ఈ తీర్పు భరోసా కల్పించింది. గతంలో పోడు పోరులో సిబ్బందిపై ఎన్నో దాడులు జరిగినా తక్కువ సమయంలో నిందితులకు శిక్షలు ఖరారు చేయడం ఇదే ప్రథమం. గతేడాది నవంబర్ 22న విధి నిర్వహణలో ఉన్న ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావును చంద్రుగొండ మండలం బెండాలపాడు ప్లాంటేషన్‌లో ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన గొత్తికోయలు మడకం తుల, పొడియం నంగ హతమార్చిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై నాటి చంద్రుగొండ ఎస్ఐ విజయలక్ష్మి, సీఐ వసంత్‌కుమార్ కేసు నమోదు చేయగా, 24 మంది సాక్షులను విచారించిన జడ్జి.. నేరం రుజువు కావడంతో నిందితులకు జీవితఖైదు విధిస్తూ గురువారం తీర్పుచెప్పారు.

పోలీస్, న్యాయ శాఖలకు కృతజ్ఞతలు



నా భర్త హత్య కేసులో తక్కువ సమయంలో నిందితులకు శిక్ష ఖరారు చేయడం సంతోషంగా ఉంది. అటవీ, పోలీస్ శాఖతో పాటు తీర్పు వెలువరించిన న్యాయమూర్తికి ప్రత్యేక ధన్యవాదాలు. మాకు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది మొదటి నుంచీ అండగా నిలిచారు. సీఎం కేసీఆర్ నేనున్నానని మనోధైర్యాన్ని కల్పించారు. ఉద్యోగంతో పాటు రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం ఇచ్చి అండగా నిలిచిన సీఎంకు రుణపడి ఉంటాం. – భాగ్యలక్ష్మి, శ్రీనివాసరావు సతీమణి

కోర్టు తీర్పు హర్షణీయం



ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావు హత్య ఘటన అటవీ శాఖను కలచివేసింది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించింది. కేవలం ఎనిమిది నెలల్లోనే నిందితులకు కోర్టు శిక్ష ఖరారు చేయడం హర్షణీయం. ఈ తీర్పు మా సిబ్బందిలో ఆత్మస్థైర్యాన్ని నింపింది. అటవీ సిబ్బంది ఎవరికీ శత్రువులు కారు. మానవ మనుగడ కోసం అడవులను సంరక్షించడమే మా బాధ్యత.

– కిష్టాగౌడ్, డీఎఫ్ఓ

అరుణాచల గిరిప్రదర్శనకు ప్రత్యేక బస్సు

సత్తుపల్లిటౌన్: తమిళనాడులోని అరుణాచలంలో గిరి ప్రదర్శనకు వెళ్లే భక్తుల కోసం సత్తుపల్లి ఆర్టీసీ డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు ఏర్పాటుచేసినట్లు డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి తెలిపారు. ఈమేరకు ఆమె గురువారం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. సూపర్‌లగ్జరీ బస్సు(సర్వీస్ 99599) ఏర్పాటుచేశామని, భక్తులు రూ.3,300 చెల్లించి ముందస్తు రిజర్వేషన్ చేయించుకోవచ్చని తెలిపారు. ఈనెల 29వ తేదీ పాటు సెప్టెంబర్ 27, అక్టోబర్ 27, నవంబర్ 25, డిసెంబర్ 25వ తేదీల్లో సత్తుపల్లి డిపో నుంచి ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని తెలిపారు. మార్గమధ్యలో శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయాల దర్శనం, అరుణాచల గిరి ప్రదర్శన తర్వాత తిరుగు ప్రయాణంలో శ్రీపురంలోని గోల్డెన్ టెంపుల్ దర్శనం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎం రాజ్యలక్ష్మి, ఉద్యోగులు

చేయించాక ఐదో రోజు సత్తుపల్లికి బస్సు చేరుకుంటుందని డీఎం చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, ఉద్యోగులు జయరాజు, కిరణ్‌బాబు, సర్వేశ్వరరావు, పిచ్చారావు, హుస్సేన్, బాబురావు, మస్తాన్‌బీ పాల్గొన్నారు.

వడ్డీతో కలిపి చెల్లించాల్సిందే..

డీసీసీబీ మాజీ చైర్మన్ విజయబాబు, కొండూరు సుధాకర్



మాట్లాడుతున్న విజయబాబు, పక్కన సుధాకర్ తదితరులు

సత్తుపల్లి: రూ.లక్ష రుణమాఫీపై సీఎం కేసీఆర్ మోసపూరిత మాటలను రైతులు నమ్మరని డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, కొండూరు సుధాకర్ అన్నారు. సత్తుపల్లిలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేసిన ఉద్యమాల ఫలితంగానే ప్రభుత్వం రుణమాఫీ చేసేందుకు ముందుకొచ్చిందని తెలిపారు. కానీ ఎన్నికల ముందు రుణమాఫీ చేస్తామనడం నమ్మశక్యంగా లేదని చెప్పారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వడ్డీతో సహా రూ.1.50 లక్షల వరకు రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, దళితబంధును పూర్తిస్థాయిలో అమలుచేయాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, సర్పంచ్ మందపాటి ముత్తారెడ్డితో పాటు ఉడతనేని అప్పారావు, దూదిపాల రాంబాబు, మందపాటి పద్మజ్యోతిరెడ్డి, కొత్తూరు కోటేశ్వరరావు, నాగరాజు, నాగళ్ల భాస్కర్ చౌదరి, గంగిశెట్టి ప్రసాద్, హనుమంతురావు, వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కేంద్రం నిధులతోనే రాష్ట్రంలో పథకాలు

కారేపల్లి: కేంద్రప్రభుత్వం ఇస్తున్న నిధులతో రాష్ట్రప్రభుత్వం పథకాలు అమలుచేస్తూ.. మరోపక్క కేంద్రంపై విమర్శలు చేయడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గురువారం పార్టీ మండల అధ్యక్షుడు ధనసరి శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని అన్ని రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణకు కూడా కేంద్రం నిధులు ఇస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెబుతున్న పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలు తదితర నిర్మాణాల్లో కేంద్రం వాటా ఉందని చెప్పారు. ఇవన్నీ పక్కనపెట్టిన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా బీఆర్ఎస్ నేతలు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు మేకల మల్లేష్, భూక్యా శ్యాంరాథోడ్, నెల్లూరి కోటేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, బీ.పీ.నాయక్, కల్తి రాంప్రసాద్, శ్రీను, దుద్దుకూరి కార్తీక్, పొడెం రామ్మూర్తి, భూక్యా సుజాత, మాన్‌సింగ్, అనిల్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ పనేనా?

- చోరీ కోసం వెళ్లి హత్యలు
- తల్లీకుమారుడి హత్యపై వీడిన మిస్టరీ

సత్తుపల్లి: తల్లీకొడుకుల జంట హత్యల కేసు ఓ కొలిక్కి వస్తోంది. ఈ కేసులో ఒక్కో చిక్కుముడిని పోలీసులు చాకచక్యంగా ఛేదించినట్లు తెలిసింది. సీసీ పుటేజీల ఆధారంగా హంతకుడిని గుర్తించినట్లు తెలుస్తున్నా ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. సత్తుపల్లి మండలం నారాయణపురానికి చెందిన తల్లీకుమారుడు రాయల తులశమ్మ, సత్యనారాయణ(చంటి)ని సోమవారం రాత్రి వారి ఇంట్లోనే కిరాతకంగా గొంతు కోసి హతమార్చిన విషయం విదితమే. అయితే, చోరీ కోసం వచ్చిన వ్యక్తే వీరిని హత్య చేసినట్లుగా పోలీసులు గుర్తించారని సమాచారం.

నగలు, నగదు కోసం...

పింఛన్, రైతుబంధుతో పాటు అంగన్‌వాడీ సెంటర్‌లో ఆయాగా పనిచేసేందుకు జమ అయిన డబ్బు తీసుకునేందుకు తులశమ్మ సోమవారం ఆటోలో దివ్యాంగుడైన తన కుమారుడితో కలిసి సత్తుపల్లి వెళ్లింది. అదే గ్రామానికి చెందిన ఆటోలోనే వెళ్లగా బ్యాంకులో నగదు తీసుకుని సరుకులు కొనుగోలు చేసింది. ఈ సమయంలో ఆమె వద్ద నగదు, మెడలో గొలుసు చోరీ చేయాలనే ఆలోచనకు ఆటోడ్రైవర్ వచ్చినట్లు సమాచారం. కాగా, చోరీ చేయడానికి వారి ఇంటికి సోమవారం రాత్రి తులశమ్మ ఇంటికి వెళ్లగా అలికిడితో కింద పడుకుని ఉన్న ఆమె ఉలిక్కిపడి లైటు వేసేందుకు యత్నిస్తుండడంతో ఆగంతకుడు నెట్టేయగా కిందపడినట్లు తెలిసింది. ఆవెంటనే చేతికందిన కొడవలితో మెడపై వేటు వేయగా ఆమె కుప్పకూలింది. కాగా, ఈ గొడవతో నిద్రిస్తున్న దివ్యాంగుడైన సత్యనారాయణ కూడా మేల్కొవడంతో అరుస్తాడనే భయంతో ఆయనపై కూడా కొడవలితో పాశవికంగా దాడి చేయగా మృతి చెందాడు.

రక్తం తుడుచుకుని.. స్నానం చేసి

ఆతర్వాత ఇద్దరిని పక్క గదిలోకి లాక్కెళ్లి పడుకోబెట్టాక, టీ షర్ట్‌కు రక్తపు మరకలను తుడుచుకున్న నిందితుడు స్నానం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అనంతరం మృతురాలి వద్ద ఉన్న నగదు రూ.10వేలతో పాటు బంగారునాన్ తాడును ఎత్తుకెళ్లినట్లు సమాచారం. కాగా, మద్యం సేవించడం, పేకాట వంటి వ్యసనాలతోనే సదరు ఆటోడ్రైవర్ చోరీ కోసం వచ్చి హత్యలు చేసినట్లు తెలుస్తోంది. ఆదివారం రాత్రి పొద్దుపోయే వరకు పేకాట ఆడిన ఆయన డబ్బులు పోగొట్టుకోవడం, ఉదయం తన ఆటోలో వచ్చి తులశమ్మ వద్ద డబ్బు చూసి చోరీ చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. కాగా, ఇంతకుముందే కొందరు స్నేహితులతో కలిసి చిన్నచిన్న దొంగతనాలు కూడా చేశాడని, అభివృద్ధి పనులకు తీసుకొన ఇనుప సామగ్రిని దొంగిలించి అమ్ముకున్న విషయం కూడా పోలీసుల విచారణలో బయటపడినట్లు తెలిసింది. కాగా, ఈ ఘటనపై విచారణ ఓ కొలిక్కి వచ్చినా కొన్ని ఆధారాలు సేకరించాల్సి ఉండడంతో పోలీసులు ఇంకా వివరాలు వెల్లడించలేదని సమాచారం.

బూత్ స్థాయిలో విస్తృత ప్రచారం చేయాలి

డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్



మధిర : సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

ఖమ్మం సహకారనగర్/మధిర/వైరా: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం బూత్ స్థాయిలో ఇప్పటినుంచే విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సూచించారు. ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో చింతకాని, ముదిగొండ మండలాల బూత్ లెవెల్ ఏజెంట్లతో ఆయన సమావేశమై సూచనలు చేశారు. అలాగే, మధిరలో జరిగిన సమావేశంలో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధితో పాటు అధికారంలోకి వస్తే అమలుచేయనున్న పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. కాగా, వైరాలో జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో దుర్గాప్రసాద్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్ మాట్లాడారు. ఈసమావేశాల్లో నాయకులు మాలోతు రాందాస్‌నాయక్, బానోతు బాలాజీ, బానోతు విజయబాయి, వడ్డే నారాయణరావు, అంబటి వెంకటేశ్వరరావు, కందుల వీరబాబు, పసుపులేటి దేవేంద్రం, మట్టా రవీందర్‌రెడ్డి, మహ్మద్ అజ్గర్, ప్రసాద్, మల్లెల అజయ్, సూరంశెట్టి కిషోర్, చావా వేణు, మిర్యాల వెంకటరమణగుప్తా, గాలి దుర్గారావు, విజయకుమార్, బి.నర్సింహారావు, తూమాటి నవీన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బాలరాజు, రవికుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, చిలువేరు బుచ్చిరామయ్య, శ్రీనివాస్, రామ్మూర్తినాయక్, దొబ్బల సౌజన్య, వెంకటనర్సిరెడ్డి, ఏదురూరి సీతారాములు, మట్టూరి కృష్ణారావు, పి.హరినాథ్, వేముల కృష్ణ పాల్గొన్నారు.

ఈ భూమి మాది.. కాదు మాదే..

- కొత్తకమలాపురంలో భూవివాదం
- భూమి ఆక్రమించారని మాజీ మావోయిస్టుల ఆవేదన



కారేపల్లి : కొత్తకమలాపురంలో ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

కారేపల్లి: మండలంలోని కొత్తకమలాపురంలో గురువారం భూవివాదం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు... మాజీ మావోయిస్టులైన పేరుపల్లికి చెందిన అలెం కృష్ణ, చర్లపల్లికి చెందిన గలిగ కోటయ్యకు 2003లో ఆనాటి ప్రభుత్వం పునరావాసం కింద కొత్తకమలాపురంలో 4.38 ఎకరాల వ్యవసాయ భూమి కేటాయించింది. దీనికి సంబంధించి ప్రభుత్వం వ్యవసాయభూమిని కెటాయిస్తూ ..పట్టా సైతం ఇచ్చింది. అయితే, పదిహేనేళ్లుగా గ్రామంలోని కొందరు వ్యక్తులు ఈ భూమిలో వ్యవసాయం చేస్తుండగా వారి అనుభవంలోనే ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదైంది. దీంతో అలెం కృష్ణ, గలిక కోటయ్య కుటుంబ సభ్యులు గురువారం భూమిలో దున్నిస్తుండగా ఇంతకాలం సాగు చేస్తున్న వారు అడ్డుతగిలారు. ఇరువర్గాలు ఘర్షణకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. కాగా, ఆదివాసీలైన మాజీ మావోయిస్టులకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని గిరిజనేతరులు కావాలని ఆక్రమించినందున న్యాయం చేయాలని ఆదివాసీ సంక్షేమ సంఘం, తుడుందెబ్బ నాయకులు వట్టం నాగేశ్వరరావు, కల్తి రాంప్రసాద్ డిమాండ్ చేశారు.

భూమి విక్రయించి డబ్బు ఇవ్వడం లేదు..

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లిలో దళితులకు చెందిన భూమిని విక్రయించగా వచ్చిన డబ్బును తమకు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ బాధితులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పైనంపల్లిలో దళితులకు చెందిన శ్మశానవాటికకు సంబంధించి 10 కుంటల స్థలాన్ని అదే గ్రామానికి చెందిన రైతుకు కుక్కల సామేలు, కుక్కల ఆదాం రూ.1.50 లక్షలకు విక్రయించారు. కానీ డబ్బును దళితులకు ఇవ్వకపోవడంతో ఇటీవల పంచాయితీ నిర్వహించారు. అయినా డబ్బు ఇవ్వకపోగా దళితులపైనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు పెద్దసంఖ్యలో స్టేషన్‌కు వచ్చి సామేలు, ఆదాంపై చర్యలు తీసుకోవాలని ఎస్సై బి.సతీష్‌ను కోరారు.

జీళ్లచెరువులో వెంచర్ వద్ద ఘర్షణ

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువు సమీపాన చేసిన వెంచర్ వద్ద గురువారం ఘర్షణ చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అన్నాదమ్ములైన ముగ్గురు రైతులు వెంచర్‌కు భూములను విక్రయించగా, నిర్వాహకులు ప్లాట్లు చేసి 65 మందికి విక్రయించారు. అయితే, తమకు మొత్తం డబ్బు ఇవ్వలేదని ఆరోపిస్తూ రైతులు వెంచర్‌లో పలుమార్లు దున్నేందుకు యత్నించడమే కాక గురువారం సర్వేనుఅడ్డుకున్నారు. ఈమేరకు సిబ్బంది ఫిర్యాదు చేయటంతో పలువురు మహిళలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కాసేపటికి వదిలేశారు. కాగా, మహిళలని చూడకుండా పోలీసులు స్టేషన్‌కు లాక్కెళ్లారని ఆరోపించిన వారు, భూమికి డబ్బులు అడగడమే తప్పా అని ప్రశ్నించారు. ఈ విషయమై సీఐ జితేందర్‌రెడ్డిని వివరణ కోరగా వెంచర్ యజమానికి, రైతుల మధ్య విషయమై సమస్య ఉందన్నారు. ఇది తేల్చుకోకుండా ప్లాట్లు కొన్న వారిని ఇబ్బంది పెట్టడం సరికాదని తెలిపారు.

రైలులో యూపీ వాసి మృతి



రాజేశ్వర్ (ఫైల్)

ఖమ్మంక్రైం: రైలులో వెళ్తున్న యూపీకి చెందిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. జీఆర్పీ ఎస్ఐ భాస్కర్‌రావు కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కుషినగర్ జిల్లా ఫజల్‌నగర్‌కు చెందిన రాజేశ్వర్(57) కేరళ రాష్ట్రంలోని కాలికట్‌లో గృహాలకు సంబంధించి సీలింగ్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తన వద్ద వ్యక్తితో కలిసి గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో స్వస్థలానికి బయలుదేరాడు. అయితే, గురువారం రైలు విజయవాడ దాటగానే గుండె నొప్పి వస్తుందంటూనే కుప్పకూలాడు. దీంతో బోగీలోని టీసీ ఖమ్మం జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఖమ్మంలో రైలు ఆగగానే రాజేశ్వర్‌ను కిందకు దింపి పరీక్షించగా మృతి చెందినట్లు తెలిపారు. దీంతో పోలీసులు ఇచ్చిన సమాచారంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

చికిత్స పొందుతున్న ఉద్యోగి...



వెంకటేశ్వర్లు (ఫైల్)

ఖమ్మం అర్బన్: ఖమ్మం గొల్లగూడెంకు చెందిన ఖమ్మం అర్బన్ తహసీల్ వాచ్‌మెన్ చిర్రా వెంకటేశ్వర్లు(51) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. గత నెల 28న ఖమ్మం నుండి గోపాలపురం మీదుగా గొల్లగూడెం వెళ్తున్న ఆయన రోడ్డుపై అడ్డొచ్చిన గేదెలు తగలడంతో కింద పడ్డాడు. ఈఘటనలో ఆయన తలకు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈమేరకు తహసీల్దార్ శైలజ, ఉద్యోగులు సురేష్, రవి, రమేష్ తదితరులు వెంకటేశ్వర్లు మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. కాగా, ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

పేపర్ బాయ్ నుంచి డాక్టరేట్ వరకు

ఘనత సాధించిన కూలీ బిడ్డ



రామకృష్ణ

తిరుమలాయపాలెం: కష్టాలు, కన్నీళ్లను అధిగమించిన ఓ కూలీ బిడ్డ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించాడు. కడు పేదరికంలో ఆకలితో అలమటించినా విద్యాప్రస్థానాన్ని ఆపకుండా ముందుకు సాగడంతో విజయం వరించింది. పాఠశాల సమయంలో పుస్తకాల కోసం కూలీగా, ఇంటర్, డిగ్రీ సమయాన పేపర్ బాయ్‌గా కూడా పనిచేసిన తిరుమలాయపాలెం మండలం ఎదుళ్లచెరువు గ్రామానికి చెందిన కాంపాటి రామకృష్ణ తల్లిదండ్రులపై భారం పడకుండా చదువు పూర్తిచేశాడు. ఎదుళ్లచెరువుకు చెందిన కూలీలైన వెంకన్న – సుశీల దంపతుల కుమారుడైన రామకృష్ణ పదో తరగతి వరకు పిండిప్రోలులోని పాఠశాల, కళాశాలల్లో, డిగ్రీ ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో, బీఈడీ హైదరాబాద్‌లో పూర్తిచేసి ఓయూ ఆర్ట్స్ కళాశాలలో ఎంఏ రాజనీతి శాస్త్రం విభాగంలో పీజీ చదివారు. అనంతరం ఇదే విభాగం నుంచి 'పాలసీ రిఫార్మ్స్ అండ్ థెయిర్ ఇంప్లిమెంటేషన్ ఇన్ ఇండియన్ ఎడ్యుకేషన్ – కేస్ స్టడీ స్కూల్, కాలేజీ, యూనివర్సిటీ ఎడ్యుకేషన్ ఇన్ తెలంగాణ' అంశంపై సామాజిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ పి.ముత్తయ్య పర్యవేక్షణలో పరిశోధనా గ్రంథాన్ని సమర్పించడంతో తాజాగా డాక్టరేట్ ప్రకటించింది. కాగా, గ్రామం నుంచి డాక్టరేట్ సాధించిన మొదటి వ్యక్తి వెంకన్న కావడంతో పలువురు అభినందించారు. ఇక మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఓయూ కేంద్రంగా జర్నలిస్టుగా కూడా ఆయన కీలకపాత్ర పోషించారు.

విద్యుత్ లైన్లను పరిశీలించిన ఎస్ఈ

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి, మత్కేపల్లి మున్నేరు పరీవాహక ప్రాంతాల్లోని వరదల కారణంగా దెబ్బతిన్న వ్యవసాయ విద్యుత్ లైన్లను ట్రాన్స్‌కో ఎస్ఈ సురేందర్ గురువారం పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మున్నేరుకు వచ్చిన వరద కారణంగా లైన్లు ధ్వంసం కావడంతో మరమ్మతులు చేస్తున్నారు. ఈమేరకు అధికారులకు, సిబ్బందికి ఎస్ఈ సూచనలు చేసి త్వరగా పనులు పూర్తిచేసి సరఫరా పునరుద్ధరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ తిలక్, ఏఈ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.